'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

రెండంకెల అంచనాలు

రాష్ట్రంలో ఎన్నికల హంగామా ముగిసిపోయింది. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నది. ఆ తీర్పు ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం అనేది మాత్రం తెలియదు. అయినప్పటికీ ప్రధాన పక్షాలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ.. మూడుపార్టీలూ తమదే పైచేయి అన్నట్టుగా చెప్పుకొంటున్నాయి. రెండంకెలకు ఎవరూ తగ్గకపోవడం విశేషం. నియోజకవర్గాల వారీగా కూడికలు, తీసివేతలతో లెక్కలు వేసుకొని పార్టీలు తమ తమ అంచనాలను వెల్లడిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో పోలింగ్‌కు, ఫలితాల వెల్లడికి మధ్య ఈ తరహా ఆత్రుత, ఆశావహ ధోరణి సాధారణమే.

ఫలితాలు వెలువడిన తర్వాత దేశంలో ప్రాంతీయ పార్టీల హవా ఖాయమని బీఆర్ఎస్ నాయకత్వం బల్లగుద్ది మరీ చెప్తున్నది. జాతీయపార్టీలు చతికిలబడటం ఖాయమని, అప్పుడు తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో ప్రజల మద్దతు భారీగా కలిగిన ప్రాంతీయ పార్టీలు ఢిల్లీలో చక్రం తిప్పుతాయని అంటున్నది. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకత వ్యక్తమవుతున్నదనే ప్రచారం మెల్లగా ఊపందుకుంటున్న నేపథ్యంలో జాతీయస్థాయిలో మళ్లీ సంకీర్ణాల యుగం వస్తుందనే భావన ఆ పార్టీ మాటల్లో తొంగిచూస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన పార్టీ కాంగ్రెస్‌కు, ఓడిన పార్టీ బీఆర్ఎస్‌కు మధ్య ఓట్లలో తేడా రెండు శాతం లోపు మాత్రమే కావడం వారి ఆత్మవిశ్వాసానికి ఒక కారణం. ఆ ఎన్నికల్లో పట్టణ ప్రాంత ఓటర్లు బీఆర్ఎస్‌కు భారీగా మద్దతు పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు కొద్దిగా తగ్గాయి. ఈసారి గ్రామీణ ఓటర్లు కూడా కాంగ్రెస్ హామీలు అమలు కాకపోవడంపై అసంతృప్తితో బీఆర్ఎస్ వైపు మొగ్గారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రచారాన్ని కేసీఆర్ బస్సు యాత్ర మలుపు తిప్పిందని బీఆర్ఎస్ గట్టి నమ్మకం. ఆ యాత్రతో సానుకూలత మరింత పెరిగిందనే అభిప్రాయమూ ఆ పార్టీలో వ్యక్తమవుతున్నది. గ్యారెంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, అదే తమకు విజయం సాధించిపెడుతుందని బీఆర్ఎస్ నమ్మకంగా ఉన్నది. అదేవిధంగా ఈ పదేండ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి నిధుల విషయంలో మొండిచెయ్యి చూపడం తమకు కలిసివచ్చే అంశమని ఆ పార్టీ భావిస్తున్నది. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాల్లో తమకు 12 నుంచి 14 స్థానాల వరకు వస్తాయని ధీమాగా చెప్తున్నది. కాంగ్రెస్, బీజేపీ రెండో స్థానం కోసం పోటీ పడ్డాయనేది ఆ పార్టీ లెక్క. ఇక హామీలు, గ్యారెంటీలు పేరిట హంగామా చేసి స్వల్ప ఓట్ల తేడాతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల మీద చాలా ఆశలే ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి తమకు 13 సీట్లు వస్తాయంటూనే హీనపక్షం తొమ్మిది చోట్ల గెలవడం ఖాయమని అంటున్నారు. అటు బీజేపీ కూడా 'మేమేం తక్కువ తిన్నామా' అని అంటున్నది. గత ఎన్నికల్లో 4 సీట్లు గెల్చుకున్న ఆ పార్టీ ఈసారి 8 సీట్ల బోనస్ కలుపుకొని మొత్తం 12 స్థానాల్లో విజయం సాధిస్తామని చెప్పుకొంటున్నది.

మొత్తం మీద మూడు పార్టీలది రెండంకెల విషయంలో ఒకటే ధోరణిగా కనిపిస్తున్నది. ఇందులో ఏ ఒక్క పార్టీ సీట్ల సంఖ్య పది దాటినా ఇతర పార్టీలకు అదేస్థాయి విజయం అసాధ్యమన్నది తెలిసిందే. ఎవరి అంచనాలు సరైనవన్నది తేలాలంటే జూన్ 4 దాకా ఆగాల్సిందే.

ఉపాధ్యాయులపై లాఠీ

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు
ఉపాధ్యాయుల సేవలు అమోఘం
ఉపాధ్యాయులు రేపటి తరాన్ని
నిర్మించే నిపుణులు
ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కన్న
గొప్ప
అనే మాటలు, ఉపన్యాసాలు విని
ఉబ్బితబ్బిబ్బవుతాం
ఎన్నికల్లో విధులను నిర్వహించాం
రెమ్యూనరేషన్ కోసం
న్యాయం అడిగితే కేంద్ర
బలగాలతో లాఠీచార్జి
చిన్నప్పుడు మీకు మేము బెత్తంతో
కొట్టింది బాగుపడుమని
మీరు పెద్దయ్యాక లాఠీలతో కొడ్తరని
ఊహించలేదయ్యా?
మీకు విద్యాబుద్ధులు నేర్పింది,
నేర్పిస్తున్నది
మీరు ఉన్నస్థాయి నుంచి ఉన్నత
స్థాయికి చేరాలని
మీరు తోసివేస్తారని, దౌర్జన్యం
చేస్తారని, అవినీతి అధికారులకు
కొమ్ము కాస్తారని
ఎందుకనుకుంటాం
ఉపాధ్యాయులు సహనపరులు
ఉపాధ్యాయులు నిస్వార్థ సేవకులు
ఉపాధ్యాయులను కొట్టినా, తిట్టినా
అడిగే దిక్కుండదనే ధీమానే కదా?
ఉపాధ్యాయులు ఉద్యమాలు
పోరాటాలు చేస్తే ప్రభుత్వాలు
కూలాయి
ఉపాధ్యాయులు లేనిదే
సర్పంచ్ నుంచి పార్లమెంటు వరకు
ఏ ఎన్నికలు జరుగవు

జనాభా లెక్కల సేకరణకు, ఎన్నికల
నిర్వహణ సక్రమంగా జరుగుటకు
ఉపాధ్యాయులే కావాలి
ఉపాధ్యాయులు అంటే ఎందుకీ
చులకనా?
ఉపాధ్యాయుల్లో ఐకమత్యం
లేకపోవడం
ఉపాధ్యాయులను కొట్టినా, తిట్టినా
మెమోలు ఇచ్చి సస్పెండ్ చేసినా అడిగే
వారెవరు?
ఉపాధ్యాయులకు సెలవులెక్కువ
వాన వచ్చిన, ఎండ కొట్టిన
సెలవేనంటూ ఏదో గొప్ప పని
చేసినట్టు మాటలు
ఉద్యోగులకు 28 రోజులు
పోలీసులకు 45 రోజుల ఈఎల్
సెలవులు కోల్పోవడం లేదా?
ఉపాధ్యాయులు ఏ మంచి
పనిచేసినా అందరం మెచ్చుకుందాం!
ఉపాధ్యాయ సంఘాల ఉపాధ్యాయ
ఎమ్మెల్సీల సహాయ సహకారాలతో
బదిలీలు, పదోన్నతులు సాధిద్దాం!
ఉపాధ్యాయుల ఐకమత్యమేమిటో
లాఠీచార్జి చేసిన కేంద్ర బలగాలను
ఉసిగొల్పిన ఊసరవెల్లులకు
ప్రజల చేత ప్రజాస్వామ్య పద్ధతిలో
బుద్ధిచెప్దాం!
ఎన్నో తప్పులను చేసినా క్షమించే
ఉదార స్వభావం కలిగిన
ఉపాధ్యాయులపై లాఠీ
అవినీతి అధికారుల లీవి
సమాజాభివృద్ధికే అవరోధం,
ఆటంకం, ఆటవికం, విచిత్రం,
విడ్డూరం ఆశ్చర్యం ...

(నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేసినందుకు స్పందిస్తూ..)

డాక్టర్ ఎస్.విజయభాస్కర్
92908 26988

రాముని బాటలో వీరు నడువగలరా?

లక్షల ఏండ్ల కిందట, త్రేతాయుగ పురుషుడిగా పుట్టిన దశరథాత్మజుడు శ్రీరాముడిని లోకాలు ఇంకా ఎందుకు గుర్తుంచుకున్నాయి? ఏ ఇతర మానవుడికి దక్కని ఆదరణ, గౌరవం, అభిమానం, ఆరాధన ఆయనకే ఎందుకు దక్కుతున్నాయి? ఇది అర్థం కావాలంటే, రాముడి వ్యక్తిత్వం అర్థం కావాలి. కండ్లు మూసుకొని రామ భజన చేయడమో, కండ్లు తెరచి రామకోటి రాయడమో కాదు; ఆ మనిషి జీవితం, జీవన విధానం, వ్యక్తిత్వ లక్షణాలు, గుణగణాలు తెలుసుకోవాలి. అటువంటి జీవనాన్ని అనుసరించాలి. ఆ గుణాలను కనీసం అనుకరించటానికి ప్రయత్నించాలి. మొట్టమొదటగా రామాయణం చెప్పిన గుణాలను గుర్తుచేసుకొని, ఆయన ప్రవర్తనను విశ్లేషించి, ఇప్పుడు మనం ఆ బాటను ఎంతవరకు అనుసరించగలమో చూద్దాం!

కనకదుర్గ దంటు
89777 243484

రామాయణంలో రాముడి గుణాలను ఇలా వర్ణించారు. గొప్ప పరాక్రమవంతుడు, ధర్మం తెలిసినవాడు, కృతజ్ఞత కలవాడు, సత్యవంతుడు, ధృఢ సంకల్పి, మంచి నడవడిక కలవాడు, సర్వ ప్రాణుల హితమునాచరించువాడు, విద్వాంసుడు, అసాధ్య కార్యములను సాధించు సామర్థ్యం కలవాడు, ఆహ్లాదమైన రూపం కలవాడు, ధైర్యం కలవాడు, కోపాన్ని జయించినవాడు, అసూయలేనివాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, నిర్వికారుడు, స్వయంప్రకాశ స్వరూపుడు. 'రమయతీతి రామః' అంటే ఆనందం కలుగజేయువాడని అర్థం. ఇన్ని శుభ లక్షణాలు గల రాముని చరిత్ర నుంచి మనమేం పాఠాలు నేర్చుకోవాలి?

మొట్టమొదటగా రాముని జీవితం నుంచి మనకు కనపడేది తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం. బాలుడిగా ఉండగానే తండ్రి పంపినప్పుడు విశ్వామిత్ర యాగ రక్షణకు వెళ్లాడు. తర్వాతి లక్షణం పరాక్రమం. యాగ రక్షణ జేసి, రాక్షసులను తరమడమే కాకుండా, శివధనస్సు సంధించి తన కంటే ఎంతో అనుభవజ్ఞులు, రాజులు చేయలేని పనిచేశాడు. ఇది ఆయన పట్టుదల, సంకల్పబలాలను తెలియజేస్తాయి. అన్ని పరిస్థితులూ బాగున్నప్పుడు అందరికీ ధైర్యముంటది. అంతవరకు సామ్రాజ్యంలో తల్లిదండ్రులు, యాగరక్షణ తర్వాత గురువు విశ్వామిత్రుడు తోడుగా ఉన్నారు. మరి పరిస్థితులు తారుమారైతే?

ఆనందంగా సాగుతున్న జీవితంలో పట్టాభిషేకం ఇంకా సంతోషాన్ని, కీర్తిని తెచ్చిపెట్టే ఘట్టం. మరి చివరి నిమిషంలో తల్లి ప్రేమ పంచిన కైకేయి కోరికలకు కోపగించాడా శ్రీరాముడు? లేదు. అమిత ఆగ్రహంతో ఒళ్లు మరిచి తండ్రిని ఎదిరిస్తానన్న లక్ష్మణుడిని శాంతపరిచాడు. కానలకి వెళ్లాలన్న సవతితల్లికి మనఃపూర్వకంగా నమస్కరించి చిరునవ్వుతో తండ్రికి వీడ్కోలు పలికి సీతా లక్ష్మణ సమేతంగా వనవాసానికి బయల్దేరాడు ఆ నిర్వికారుడు, ఇంద్రియాలను జయించిన ధీరుడు. బాహ్యంగా ఉన్న శత్రువులను జయించటం చాలామందికి సాధ్యమే. మరి అంతర్గత విరోధులైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలని జయించటం అంత తేలికా? రాజవుదామన్న కామం (కోరిక) లేదు, ఆ అవకాశాన్ని చెడగొట్టిన సవతి తల్లి మీద క్రోధం లేదు, అధికార లోభం లేదు, పరిపాలకుడి కీర్తి మీద మోహం లేదు, రాజు అయి తీరాలన్న మదం (అహం) లేదు, తన స్థానంలో నిలవబోతున్న తమ్ముడు భరతుడి మీద మత్సరం (అసూయ) లేదు! అరిషడ్వర్గాలని జయించిన స్థితప్రజ్ఞుడు శ్రీరాముడు. అదీ మొదటి కారణం యుగయుగాలకి మానవులందరికీ ఆదర్శ పురుషుడిగా శ్రీరాముడు నిలవటానికి. ఇక ధర్మరక్షుడిగా రాక్షసులను సంహరించటం అవలీలగా చేశాడు ఈ అమిత పరాక్రమవంతుడు. వేదాల్లో ప్రవచించిన సనాతన ధర్మాన్ని అనుసరించి, మంచి కోరని, మారని దురాత్ములను సంహరించాడు, ధర్మాత్ములని రక్షించాడు. నిజానికి సొంత అన్నదమ్ములైన వాలీ, సుగ్రీవులు ఆయనకు సంబంధీకులు కారు. కానీ అక్కడ అధర్మ ప్రవర్తనను ఖండించి, ధర్మ ప్రవర్తనను చూపించి సుగ్రీవుడికి పట్టం కట్టాడు.

జాతి భేదం లేకుండా అందరినీ ఆదరించాడు. ప్రకృతిని ప్రేమించి చరిత్రలో ఒకే ధర్మం, ఒకే దార (భార్య) అని ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాడు. శూర్పణక శృంగార చేష్టలకు చెదరలేదు. దూరమైన సతి తలపులలో బతికాడు. ఆమెను రక్షించటానికి సాహసంగా సముద్ర మథనం చేశాడు. లంకకు చేరి భీకర పోరు సలిపాడు. అయితే మంచి, చెడుల విచక్షణ మరవలేదు. రావణ, కుంభకర్ణుల సోదరుడు విభీషణుడిని ఆదరించాడు. ఈ రకమైన విచక్షణ ప్రపంచంలోని మానవులందరికీ ఆదర్శం. వేరే కులమో, మతమో, దేశమో అయినంత మాత్రాన అంతా చెడ్డవారే అనుకోవటం ఎంత తెలివి తక్కువతనమో చూపించాడు మానవులకు.

తమకు అప్పుడైన జటాయువుకి ఎంత అభిమానంగా, గౌరవంగా కర్మకాండలు చేశాడో, శత్రువైన రావణుడికీ అంతే ఆదరంగా, గౌరవంగా కర్మకాండలు జరిపించి, విభీషణుడికి పట్టం కట్టాడు. మరి ఈ విచక్షణ, ధర్మ ప్రవర్తన మనుష్యులందరికీ ఆదర్శం కాదా! ఏ పరిస్థితుల్లోనైనా ధర్మం తప్పటం, భావావేశంలో పొల్లు మాట, తగని చేత చేయని పూర్ణ ధర్మ స్వరూపం అయోధ్య రాముడు.

మరి ఈ గుణాలన్నీ ఒకసారి చర్విత చర్వణం చేశాక ఇప్పుడు మనం ఏం చేయాలి? అయోధ్య ఎవరిది? ఎవరికి అధికారం ఇవ్వాలి? ఎవ్వరు ఏం చేయాలి? నిజానికి మనం ఏదో చేస్తున్నామని భుజాలు చరచుకోనవసరం లేదు. అన్ని జరగవలసినట్టే జరుగుతాయి. మనం చేయవలసినదొక్కటే! ఏ దేశస్థులైనా, ఏ మతస్థులైనా, ఏ కులస్థులైనా, ఏ జాతివారైనా ఈ లోకాలలో ఉన్నవారందరూ శ్రీరాముడి వారసులే! సనాతన ధర్ములే! ఒకప్పుడు వివిధ రాజ్యాలుగా ఉన్న ప్రపంచంలో బతికి, వేద ఆధ్యాత్మికతను ఆదరించినవారే! కనుక, ప్రపంచం మళ్లీ వేద ధర్మంలోకి, సనాతన సంస్కృతిలోకి వెళుతోంది కనుక అయోధ్య రాముడి సందర్శనానికి అందరినీ ఆహ్వానిద్దాం. అదే మనం శ్రీరాముడికి చూపించే గౌరవం, అభిమానం.

జలకళ మృగ్యమై

చెమ్మగిల్లిన నేత్రాలు మావి
సొమ్మసిల్లిన దేహాలు మావి
దురదృష్టం కోరలతో రక్తసిక్తులం
దుర్భిక్షం కాటులతో రిక్త అస్తికలం
మా కష్టం సత్యం
మా నష్టం నిత్యం
మా ఇక్కట్లు దుర్భర స్థితిగతులకు నకళ్లు
మా వాకిళ్లు దయనీయావస్థలకు ఆనవాళ్లు
చదువుల్లేవ్
పదవుల్లేవ్
కంటక కాటక పరిస్థితులెదిరించే
సామర్థ్య కొలువుల్లేవ్
బీళ్ల నేలతో సంసారం
రాళ్ల నేలతో సంపర్కం
ఆకాశం వైపు ఆశల చూపు
పవనాల పయనాలు
అనూహ్యమై అమేయ బలీయమై
నీరు లేక నారు లేక పైరు లేక
వాడు ముఖం పాడు ముఖం గోడు ముఖం
జలకళ మృగ్యమై
జీవకళ అదృశ్యమై
ఎండుడొక్కల ఎడ్లకు మేతలేక
గాదెలు నింపే వడ్లకు రాతలేక
పతనమే పరాకాష్ఠగా
ఉత్థానమే ఉపవిషగా
బతుకు బేజారు
చితికి దరి చేరు

కోటం చంద్రశేఖర్
94920 43348

పరితపించిన పండుటాకులు

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

'అమ్మా.. ఎమాయే ఇంకా వస్తలేరు, ఎంతసేపుంటరు?'
'జర ఆగయ్యా ఓటు వేయొద్దా? గుర్తు దొరకడంలేదు. ఓటు వేసొస్తా..!'

మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో కేసీఆర్ కారు గుర్తు కోసం పరితపించిన పండుటాకులను జీవితంలో మరువలేం. కేసీఆర్ మీద వారికున్న ప్రేమను చూస్తే జీవితంలో ఇంతకన్నా ఏ నాయకునికైనా ఇంకేం కావాలనిపిస్తుంది. చంద్రశేఖరున్ని గుండెల్లో నింపుకొన్న పండుటాకుల ప్రేమకు అందరూ ఫిదా కావాల్సిందే.

పార్లమెంటు ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేయడంతో పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు వారి సంఖ్యకు అనుగుణంగా రెండు మూడు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థులకు సంబంధించిన క్రమ సంఖ్యను 3, 4వ నంబర్ దగ్గర కారు గుర్తును చూసి ఓటేయాలని ఆ పార్టీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. అయితే నమూనా ఈవీఎంతో ప్రచారం అనుకున్న స్థాయిలో చేయలేకపోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద పండుటాకులు ఆగమాగం కావడం కనిపించింది. 200 పింఛన్‌ను మొదాలు 1,016, తర్వాత 2,016, వికలాంగులకు 4,016 వరకు పెంచి కేసీఆర్ వారికి పెద్దదిక్కుగా నిలిచాడు. నిజానికి గతంలో 200 పింఛన్ వస్తే అవి వారి కనీస అవసరాలకు సరిపోయేవి కావు. ఇంట్లో కుటుంబీకులు వారిపై తగినంత శ్రద్ధ కూడా చేసేవారు కాదు.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక 200 పింఛన్‌తో ఏమొస్తయని 2000 చేశాడు. దీంతో పండుటాకులకు ఎంతో ధైర్యం వచ్చింది. చేతిలో ఖర్చులకు డబ్బులు నెలనెలా వస్తుండటంతో మనుమలు, మనుమరాండ్లకు కూడా నాలుగు రూపాయలు ఇచ్చేవారు. కొడుకు, కోడలు కూడా బాగా చూసుకోవడం కనిపించింది. మా జీవితానికి భరోసా ఇచ్చిన కేసీఆర్ కోసం శాసనసభ ఎన్నికల్లో కూడా ఎక్కువ శాతం ఓట్లేశారు. కొద్ది తేడాలో కేసీఆర్ ప్రభుత్వం రాకపోవడంతో వారు ఎంతో మధనపడ్డారు. అయ్యో.. మాకు నెల నెలకు పింఛన్ అందించి ఆధారం చూపిన పెద్ద కొడుకు కేసీఆర్ రాక పాయే అని వారు బాధపడుతూ మాట్లాడటం కనిపించింది.

ఈ క్రమంలో పార్లమెంటు ఎన్నికలు రావడంతో ఈసారైనా కేసీఆర్ రావాలని, కారు గుర్తుకు ఓటెయ్యాలని వారు బలంగా అనుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేసరికి రెండు, మూడు ఈవీఎంలు ఉండటంతో కొంతమంది ఆగమయ్యారు. కారు గుర్తు ఎక్కడ? అని ఈవీఎంలలో వెతికారు. దీంతో ఓటు వేయడం ఆలస్యం కావడంతో సిబ్బంది 'ఎంత సేపు' అని అనడం, 'గుర్తు కనపడటం లేదు, వేసి వస్తాం' అని వారు జవాబివ్వడం లాంటి సంఘటనలు అన్ని పోలింగ్ స్టేషన్‌లలో చోటుచేసుకున్నాయి. ఈవీఎంలలో ఎక్కువ గుర్తులు ఉండటంతో కొంత ఆందోళనకు గురయ్యారు. నాడు కేసీఆర్ ముఖ్యమంత్రి కాలేకపోయాడు, ఇప్పుడైనా(కారు) కేసీఆర్ గెలవాలని, మా ఓటు బరాబర్ కారుకే వేయాలని వారు ఈవీఎంలలో వెతికి మరీ ఓటు వేశారు. కంటిచూపు తక్కువున్నవారు మాత్రం చాలా ఇబ్బందిపడ్డారు. తిన్న దగ్గర రేవు తలవాలన్నట్టు వారు చూపించిన శ్రద్ధను మరువలేం. అలాగే పండుటాకులతో పాటు రైతు బిడ్డలు కూడా ఎక్కువ శాతం కేసీఆర్‌కే మొగ్గు చూపడం కనిపించింది.

రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ ప్రజలను ఒక్కటి చేసి సాధించిన కేసీఆర్ పదేండ్లలో తెలంగాణను బంగారు తునుక చేశారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమాన్ని, కేసీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక జిత్తుల మారి కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై విష ప్రచారం చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలువకుండా అడ్డుకున్నాయి. 6 గ్యారంటీలతో సహా 420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బొక్కబోర్లా పడటంతో వారి అసలు రంగు బయటపడింది. జరిగిన పొరపాటును ప్రజలు గుర్తించారు. ప్రభుత్వం రాకపోయినా ప్రజల గుండెల్లో కేసీఆర్ మాత్రం చెరగని ముద్ర వేసుకున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఎక్కడ చూసినా కేసీఆర్ పథకాలే, ఆయన చేసిన అభివృద్ధే కనిపిస్తున్నది. కేసీఆర్ బస్సు యాత్రలకు జన నీరాజనం పట్టారు.

నాడు దొరల పాలన, గడీల పాలన, మద్యం ఏరులై పారుతుందంటూ ఊదర గొట్టిన యూట్యూబ్ చానళ్లు జరిగిన పొరపాటును గుర్తించి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నాయి. ఉన్నప్పుడు తెలియదు మంచోని విలువ.. కోల్పోయినప్పుడే తెలుస్తుందన్నట్టు నేడు తెలంగాణ అంతటా కారు రావాలని, కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారు.

లేఖ

వృద్ధులకు ఎంతో మేలు

బీమా పాలసీలు తీసుకునేవారి వయోపరిమితిని ఎత్తేయడం ఆహ్వానించదగిన పరిణామం. 65 ఏండ్లలోపు వారే బీమా పాలసీలు తీసుకునేందుకు వీలుగా ఉన్న నిబంధనలను బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏ తొలగించడం వల్ల వయోధికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. వయోవృద్ధుల సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుంది.

బీమా పాలసీలు తీసుకునేవారి వయస్సు విషయంలో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్న ఐఆర్‌డీఏ మరో అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరముంది. బీమా ప్రీమియంలు భారీగా ఉంటుండటంతో చాలా మంది పేదలు, మధ్య తరగతివారు బీమాకు దూరమవుతున్నారు. బీమా లేకపోవడంతో అనుకోకుండా జరిగే ప్రమాదాల సమయంలో దవాఖాన బిల్లులు చెల్లించుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రీమియం తక్కువగా ఉంటే అనేకమంది బీమా వసతిని వినియోగించుకుంటారు.

అంతేకాకుండా ప్రజల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కార్పొరేట్ హాస్పిటల్ తరహాలో ప్రభుత్వ దవాఖానల్లోనూ విస్తృత స్థాయిలో వైద్య సౌకర్యాలు కల్పించాలి. అధిక ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉన్నది. దాని కోసం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. ఆ కమిటీ సిఫారసుల మేరకు పేదలకు అందుబాటులో ఉండే విధంగా ధరలను నిర్ణయించాలి. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం బాగుంటుంది.

- దండంరాజు రాంచందర్‌రావు
98495 92958



మోదీ డైరెక్షన్‌లో ఎన్నికల సంఘం!

ఎన్నికల కమిషన్ కీలుబొమ్మ లాంటిది. ప్రధాని నరేంద్రమోదీ డైరెక్షన్ ప్రకారమే అది పని చేస్తుంది. దేశంలో ఎన్నికలు రెండున్నర నెలలుగా జరుగుతున్నాయి. మీరెప్పుడైనా (ఎన్నికల సంఘం అధికారులు) సాధారణ ప్రజల ఇబ్బందులను గుర్తించారా?

- మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి